

గంజాయి చాక్లెట్లు తరలిస్తూ..
గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను చౌటుప్పల్ బస్టాండ్‌లో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. - 8లో



స్వర్ణగిరిలో గిరి ప్రదక్షిణ
భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా ఆదివారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	551.40 అడుగులు
ఇన్‌ఫ్లో	:	63,317 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,650 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : నిల్		
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,650 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

నేటి పోలీస్ గ్రీవెన్స్ డే రద్దు

నల్లగొండ: సూర్యాపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా సోమవారం నల్లగొండలోని ఎస్పీ కార్యాలయంలో జరగనున్న పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు ఈ విషయం గమనించాలని కోరారు.

నేడు నల్లగొండకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

నల్లగొండ టూటౌన్: నల్లగొండకు సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు రానున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు తెలిపారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం కార్యకర్తలతో జరిగే విస్తత స్థాయి సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతయ్య

నకిరేకల్: సమాజంలో మానవహక్కులపై అన్నివర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరచాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదరి డాక్టర్ తిరుపతయ్య అన్నారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో మానవ హక్కుల చరిత్ర అనే అంశంపై మాట్లాడారు. వేదిక రాష్ట్ర నాయకుడు గోసుల మోహన్‌రెడ్డి ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి అధ్యక్షతన జరి గిన ఈకార్యక్రమంలో వేదిక తెలంగాణ సమన్వయ కమిటీ నాయకులు జీవన్‌కుమార్, జి.హరికృష్ణ, ప్రతినిధులు జి.గురువయ్య, దశరథ, నంద్యాల హరిందర్, మధు లక్ష్మల్ల, గడ్డం వెంకటరమణ, నంద్యాల సులోచన, జరీనా, మరశీకృష్ణ, ఉదయ్, చెట్టిపల్లి కాశీరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొన్న సన్న బియ్యం.. నేడు రేషన్ కార్డులు

సంక్షేమంలో రెండు కీలక పథకాల అమలు మన దగ్గరి నుంచే..
- ఉమ్మడి జిల్లాకు దక్కిన ప్రాధాన్యం
- నేడు తిరుమలగిరి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండకు..



తిరుమలగిరిలో ముస్తాబైన సభా ప్రాంగణం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రజా సంక్షేమంలో కీలకమైన పథకాల అమలులో ఉమ్మడి నల్లగొండ జిల్లా వేదికగా నిలుస్తోంది. ఇప్పటికే సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి.. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్‌కార్డుల పంపిణీకి కూడా ఆయనే శ్రీకారం చుట్టనున్నారు. నిరుపేద కుటుంబాలకు ఆహారభద్రత కల్పించే ముఖ్యమైన రెండు పథకాల అమలుకు ఉమ్మడి నల్లగొండనే కేంద్ర బిందువు కావడం విశేషం.

నెరవేరబోతున్న పేదల కల
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అర్హులందరికీ రేషన్‌కార్డులిస్తామని ప్రకటించింది. అందులో భాగంగా దరఖాస్తులు స్వీకరించింది. అర్హులకు కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో నిరుపేదల కల నెరవేరబోతోంది. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా రాకపోవడంతో రేషన్ బియ్యం అందక అనేక ఇబ్బందులు పడ్డారు. అలాంటి వారందరికీ ఇప్పుడు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు అధికారులు అర్హుల జాబితాలను సిద్ధం చేశారు. సోమవారం సీఎం పంపిణీని ప్రారంభించిన తరువాత జిల్లాల్లో పజాప్రతినిధుల ద్వారా కార్డులు పంపిణీ చేస్తారు.

మంత్రి ఉత్తమ్ ప్రత్యేక చొరవ
రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి అయినందున సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరిలో కార్యక్రమం ప్రారంభించేలా సీఎంను ఒప్పించారు. గతంలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని కూడా తన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్ నుంచే ప్రారంభించారు. తాజాగా తిరుమలగిరి నుంచి రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభిస్తున్నారు. రెండు కీలకమైన పథకాలు మనజిల్లా నుంచే ప్రారంభం కావడం జిల్లాకు దక్కిన గౌరవంగా చెప్పుకోవచ్చు.

సీఎం టూర్ షెడ్యూల్

- మధ్యాహ్నం 2గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 2.15 గంటలకు రామోజీ ఫిలింసిటీకి వస్తారు.
- 3:30 గంటల వరకు అక్కడ శ్రీమద్‌భాగవతం సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తారు.
- 3:30 గంటలకు అక్కడనుంచి బయలుదేరి 4 గంటలకు తిరుమలగిరికి చేరుకుంటారు.
- 4:15 గంటలనుంచి 5:10 గంటల వరకు తిరుమలగిరిలో బహిరంగ సభలో పాల్గొంటారు.
- 5:10 గంటల నుంచి 5:30 గంటల వరకు లబ్ధిదారులకు ఆహార భద్రత (రేషన్) కార్డులను పంపిణీ చేస్తారు.
- 5:30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి బేగంపేటకు చేరుకుని అక్కడ నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళతారు.

50వేల మంది జనసమీకరణ



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ తదితరులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలో సోమవారం చేపట్టనున్న నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి 50 వేల మంది జనసమీకరణకు ఏర్పాట్లు చేశారు. కార్డుల లబ్ధిదారులు, సమభావన సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వస్తారని అంచనా వేశారు. జన సమీకరణకు 300 ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రాక సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వెనక ఉన్న 35 ఎకరాల్లో సభా స్థలి ఏర్పాటు చేశారు. రెండు హెలిపాడ్లు, 11 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలోని పరిసరాల్లో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే మందుల సామేల్ కటౌట్లతో నింపారు.

సభా వేదికపై కొందరికే ఛాన్స్
సభా వేదికపై కూర్చునేందుకు ప్రొటోకాల్ ప్రకారం కొందరికే అవకాశం కల్పించనున్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సభ్యులు, అధికారులు కూర్చోనున్నారు.

అత్యధిక కార్డులు నల్లగొండ జిల్లాకే..

కొత్త కార్డులు మంజూరైన పది జిల్లాల్లో నల్లగొండ అగ్రస్థానంలో ఉంది. నల్లగొండ లో 50,102 కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయి. ప్రస్తుతం 4,65,998 కార్డులతో కలిపి మొత్తం 5,16,100 కార్డుల ద్వారా 16,80,916 మందికి లబ్ధి చేకూరనుండగా, పేర్లు చేర్పుల ద్వారా మరో 1,06,559 మందికి లబ్ధి చేకూరనుంది. సూర్యాపేట జిల్లాలో 3,26,057 పాత కార్డులకుతోడు ఇప్పుడు 23,870 కొత్త కార్డులు రాబోతున్నాయి. మొత్తంగా 3,49,927 కార్డుల ద్వారా 10,57,863 మందికి లబ్ధి చేకూరనుంది. యాదాద్రి జిల్లాలో 2,16,831 పాత కార్డులకుతోడు ఇప్పుడు 15,077 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. మొత్తం 2,31,908 కార్డుల ద్వారా 7,29,746మందికి లబ్ధి చేకూరనుంది.

కనకదుర్గమ్మకు బోనం



నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడలో ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. - రామగిరి(నల్లగొండ)

న్యాయశాఖ ఉద్యోగులకు అండగా ఉంటాం

- న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబాబు



నియామక పత్రం అందుకుంటున్న వీరబాబు

రామగిరి(నల్లగొండ): న్యాయశాఖ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూనే ఏ ఒక్క ఉద్యోగికి ఏ కష్టమొచ్చినా అండగా కార్యవర్గ సభ్యులమంతా ఉంటామని జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాతంగి వీరబాబు అన్నారు. ఇటీవల ఎన్నికైన జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం నల్లగొండలోని పోలీస్ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డి.లక్ష్మారెడ్డి నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు వీరబాబు మాట్లాడారు. నూతన కార్యవర్గాన్ని సంఘ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ సుబ్బయ్య, వీవీ.రమణారావు, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, టీఎన్జీఓ అధ్యక్షుడు మురళి, జిల్లా న్యా యశాఖ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ ఎండి.లతీఫ్, కార్యనిర్వాహణ కార్యదర్శి వంశీకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాంబాబు జంగయ్య, ఉషారాణి, జాయింట్ సెక్రెటరీలు తిరుమలేష్, సుజాత, రాములు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు

రామగిరి(నల్లగొండ): తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ సహకారంతో నల్లగొండ కోమలి కళాసమితి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 16వ తేదీ వరకు నల్లగొండలో తెలంగాణ రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు జరగనున్నాయని కళా సమితి సభ్యులు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు ప్రారంభించనున్న ఈ నాటకోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

కోట శ్రీనివాసరావు మృతికి 'గుత్తా' సంతాపం

నల్లగొండ టూటౌన్ : ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కోట ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

నాగార్జునసాగర్: విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో హోంగార్డు మృతిచెందాడు. వివరాలు.. తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్ల గ్రామానికి చెందిన అంగోతు కిషన్ (43) నాగార్జునసాగర్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని విజయపురి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కిషన్‌కు కొద్దిసేపటికే ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో తోటి సిబ్బంది స్థానిక కమలా నెహ్రూ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హోంగార్డు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సాగర్ సీఐ శ్రీనునాయక్, ఎస్‌ఐ ముత్తయ్య కిషన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చిట్యాల: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన చిట్యాల మండలం చిన్నకాపర్తిలో ఆదివారం జరిగింది. చిన్నకాపర్తి గ్రామానికి చెందిన నకిరేకంటి గణేష్ కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం ఉదయం గణేష్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గణేష్, అతడి కుమారులు మంటలను గమనించి వెంటనే ఇంట్లో నుంచి బయటకు పరుగు తీశారు. ఇంట్లోని నిత్యావసర సరుకులు, దుస్తులు, రూ.2.80లక్షల నగదు కాలిబూడిదైనట్లు బాధితుడు పేర్కొన్నాడు.

మహిళ మృతదేహం లభ్యం

హుజూర్‌నగర్: చింతలపాలెం మండలం కిష్టాపురం శివారు అటవీ ప్రాంతంలో ఆదివారం మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపారు. మృతురాలు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం విక్రమ్‌పూర్‌తండాకు చెందిన అస్లీగా గుర్తించామన్నారు. హత్య కేసు దర్యాప్తులో భాగంగా కొణిజర్ల పోలీసులు నిందితుడితో పాటు ఇక్కడకు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేడియోతోనే కాలక్షేపం

- 50 సంవత్సరాలుగా రేడియో వాడుతున్న రైతు

తిప్పర్తి: 1990ల్లో ప్రసార సాధనాలు లేని సమయంలో వార్తలు వినడానికి గ్రామాల్లో ధనికుల ఇళ్లలో ఎక్కువగా రేడియోలు ఉండేవి. కాలక్రమేణా అవి కనుమరుగై టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వచ్చాయి. కానీ నేటి తరంలో కూడా రేడియోను వాడుతున్నాడు తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడెం గ్రామానికి చెందిన రైతు చింతకుంట్ల సుదర్శన్‌రెడ్డి. తనకు ఊహ తెలిసినప్పటి నుంచి రేడియో వాడుతున్నానని, 50 ఏళ్లుగా రేడియో వింటున్నా.. ఇప్పటికీ తనకు ఇంకా ఆసక్తి తగ్గలేదని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పొలం దగ్గర వెళ్లినప్పుడు రేడియోను కూడా వెంట తీసుకెళ్తానని, అందులో పాటలు, జానపద గేయాలు, బుర్రకథలు, వ్యవసాయ సమాచారం, అన్నదాతల సందేహాలను వింటానని ఆయన చెబుతున్నారు. గతంలో పాత రేడియో ఉండేదని, ప్రస్తుతం కొత్త రకం రేడియో తీసుకున్నానని వివరించారు. తన తండ్రి దగ్గర ఉన్న రేడియోను తనకు 30 సంవత్సరాలు వచ్చే వరకు వాడానని, ఆ తర్వాత ఆ రేడియో రిపేర్‌కు రావడంతో మార్చానని, ఇప్పటి వరకు ఐదు రేడియోలను వాడానని పేర్కొన్నారు.



రేడియో వింటున్న రైతు సుదర్శన్‌రెడ్డి

టీవీ చూడాలనిపించదు

ఇంట్లో టీవీ ఉన్నప్పటికి నాకు మాత్రం టీవీ చూడాలనిపించదు. ఎక్కువగా రేడియోలో ప్రసారమయ్యే కార్యక్రమాలనే వింటుంటాను. నాకు పెళ్లిలో కూడా రేడియో ఇవ్వలేదు. ఎందుకంటే అప్పటికే మా ఇంట్లో రేడియో ఉండడంతో రేడియో ఇవ్వమని అడగలేదు. ప్రస్తుతం నా వయస్సు 60సంవత్సరాలకు పైబడినా ఇంకా రేడియోను వాడుతుంటాను.

– చింతకుంట్ల సుదర్శన్‌రెడ్డి

స్వర్ణగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రం సందర్భంగా ఆదివారం ఉదయం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, సుదర్శన నరసింహ హవనం, నిత్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



గిరి ప్రదక్షిణకు సిద్ధమవుతున్న భక్తులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వలిగొండ: వలిగొండ మండలం ఎం.తుర్కపల్లిలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి శ్రీశైలం(45) ఆదివారం తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల వెనుక, ఎడమ కంటిపై భాగంలో గాయాలను గుర్తించినట్లు తెలిపారు. శ్రీశైలం భార్య, కుమారుడు బంధువుల దశదిన కర్మకు వెళ్లగా.. వారికి సమాచారం ఇవ్వడంతో వచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

జాల గ్రామంలో..

రాజాపేట: రాజాపేట మండలం జాల గ్రామానికి చెందిన వ్యక్తి తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జాల గ్రామానికి చెందిన ఇస్మాయిల్ (55) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఇంట్లో ఒక్కడే నివాసముంటున్నాడు. పాముకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని కాశగూడేనికి చెందిన వ్యక్తి పని కోసం ఇస్మాయిల్‌ను తీసుకువెళ్దామని ఆదివారం ఉదయం అతడి ఇంటి వద్దకు వచ్చి ఎంత పిలిచినా పలకలేదు. దీంతో కిటికీ లోంచి ఇంట్లోకి తొంగి చూడగా ఇస్మాయిల్ మృతిచెంది ఉన్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో మూడు రోజుల క్రితమే ఇస్మాయిల్ మృతిచెంది ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.



ఇస్మాయిల్ (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. చిట్యాల ఏఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం ఇస్మాయిన్‌పల్లి గ్రామానికి చెందిన మాద నర్సింహ (50) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ఈ నెల 10వ తేదీన పని నిమిత్తం బైక్‌పై మునుగోడుకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో చిట్యాల మండలం ఎలికట్టె గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన గూడ్స్ వాహనం నర్సింహ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సింహను హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి..

మఠంపల్లి: మఠంపల్లి మండలం పెదవీడు గ్రామానికి చెందిన ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి సాముల కోటిరెడ్డి(45) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కోటిరెడ్డి 22ఏళ్ల పాటు ఆర్మీలో పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయ్యారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



కోటిరెడ్డి (ఫైల్)

ఆటో బోల్తా.. యువకుడి మృతి

పెన్‌పహాడ్: ఆటో బోల్తాపడి గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన తండ సైదులు(29) ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం శనివారం సూర్యాపేటకు వెళ్లి ఆటోలో తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. అనంతారం గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ సమీర్ రోడ్డుపై గేదెలను తప్పించబోయే క్రమంలో ఆటో బోల్తా పడింది. సైదులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు సైదులు కళ్లను తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో..

చిట్యాల: ఇంట్లో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం వెలిమినేడులో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన లక్ష్మారెడ్డి వెలిమినేడు గ్రామంలో రాంకీ సంస్థకు చెందిన భూములను పర్యవేక్షిస్తూ గ్రామంలో ఒక్కడే నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం లక్ష్మారెడ్డి ఇంట్లో ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గుర్తించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఆదివారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎండీ అంజాద్, ఎండీ పాషా సూర్యాపేట జిల్లా కోదాడ సంతలో 12 గోవులు, 2 ఎద్దులను కొనుగోలు చేశారు. వాటిని డీసీఎంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం శివారులోని తంగేడువనం పార్కు సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. డీసీఎంలో గోవులు, ఎద్దులు ఉండడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని గోవులను గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● ఆలిగా.. అమ్మగా..

మర్రిగూడ: కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని పెళ్లిలో చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకుంటోంది మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామానికి చెందిన భిక్షమమ్మ. ఆదివారం సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆమె తన భర్త రత్నయ్యను తీసుకొని వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త రత్నయ్యకు మధ్యాహ్నం భోజనం తీసుకొచ్చి తినిపించింది. వీరికి ముగ్గురు ఆడపిల్లల సంతానం కాగా.. అందరికీ వివాహాలు చేశారు. వీరు గతంలో మిరపకాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు.



భర్త రత్నయ్యకు అన్నం తినిపిస్తున్న భిక్షమమ్మ

ఆస్తి పంపకంలో విభేదాలు

- కుమారుడు వేధిస్తున్నాడని మిర్యాలగూడ డీఎస్పీకి ఫిర్యాదు చేసిన వృద్ధ దంపతులు

మిర్యాలగూడ అర్బన్: ఆస్తి పంపకంలో విభేదాలు రావడంతో తమ కుమారుడు తమను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆదివారం మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజుకు వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన గగినేపల్లి బుచ్చిరెడ్డి, అనసూర్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. కుమారులిద్దరికి చెరో 3.10 ఎకరాల భూమిని పంచి ఇచ్చారు. మరో 3 ఎకరాలు ఆ వృద్ధ దంపతులు తమ పేరు మీదనే ఉంచుకున్నారు. ఇద్దరు కుమారులు బుచ్చిరెడ్డి, అనసూర్యమ్మ దంపతుల ఆలనాపాలనా చూడకపోవడంతో.. వారు తమ మనవడు దిలీప్‌రెడ్డి(చిన్న కుమారుడి కొడుకు) వద్ద ఉంటున్నారు. తమ మనవడు తమను బాగా చూసుకుంటాని వృద్ధ దంపతులకు నమ్మకం కలగడంతో వారి పేరుపై ఉన్న 3 ఎకరాల భూమిని మనవడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో తమ పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి, కోడలు మణిమాల వారి కుమారుడు సందీప్‌రెడ్డి తమపై దాడులకు దిగుతున్నారని.. దిలీప్‌రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన భూమిని తమకు కూడా ఇవ్వాలని బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని వృద్ధ దంపతులు తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వృద్ధ దంపతులు పేర్కొన్నారు.

1200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ



హాజరైన పోలీస్ అధికారులు

- సూర్యాపేట ఎస్పీ నర్సింహ

తిరుమలగిరి (తుంగతుర్తి): సీఎం రేవంత్‌రెడ్డి తిరుమలగిరిలో సోమవారం పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ తెలిపారు. ఆదివారం తిరుమలగిరిలో పోలీస్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. సీఎం బహిరంగ సభకు 1200 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పునరుద్ధరించాలని ఆదేశించారు. నలుగురు ఏఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 33 మంది ఇన్‌స్పెక్టర్లు, 110 మంది ఎస్‌ఐలు, 185 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 650మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీధర్, శ్రీనివాసరావు, సురేష్‌కుమార్, మొగులయ్య, రవి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాల కేటాయింపు

- సూర్యాపేట, తొర్రూరు, జనగామ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు అగ్రికల్చర్ మార్కెట్ యార్డు, సంత నందు ఏర్పాటు చేసి పి6, పి7 ప్రదేశాల్లో నిలుపుకోవాలి.
- సూర్యాపేట, తొర్రూరు, జనగామ నుంచి వచ్చే ట్రాక్టర్లు, డీసీఎంలు తిరుమలగిరి క్రాస్ రోడ్డు నుంచి జనగామ వెళ్లే రోడ్డు మార్గంలో ఎడమ వైపున సంత వెనకాల స్థలంలో ఏర్పాటు చేసిన పీ4 పార్కింగ్ స్థలంలో నిలపాలి.
- జనగామ, తొర్రూరు, సూర్యాపేట వైపు వచ్చే కార్లు, ఆటోలు, మినీ వ్యాన్లు వలిగొండ రోడ్డులో వచ్చి చెరువుకట్ట మార్గంలో ఉన్న పీ2, పీ11, పీ5 పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుకోవాలి.
- తొర్రూరు, సూర్యాపేట, జనగామ వైపు నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు వలిగొండ మార్గంలో చెరువు కట్ట రోడ్డులో ఏర్పాటు చేసిన పీ3 స్థలంలో నిలుపుకోవాలి.
- వలిగొండ మార్గంలో వచ్చే ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు, అదే మార్గంలో ఉన్న ఐకేపీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పీ10 పార్కింగ్ ప్రదేశంలో, వెంచర్‌లో ఏర్పాటు చేసిన పీ8 స్థలంలో వాహనాలు నిలుపుకోవాలి.
- వలిగొండ వైపు నుంచి వచ్చే కార్లు, ఆటోలు, మినీ వ్యాన్‌లు వెంచర్‌లో ఏర్పాటు చేసిన పీ9 పార్కింగ్ ప్రదేశంలో నిలపాలి.

సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ఆదివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని సభాస్థలిలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ రాంబాబు, జెడ్పీసీఈఓ అప్పారావు, డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్ ఉన్నారు.



సభా వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎంపీ చామల

రేషన్‌కార్డుల పంపిణీకి భారీగా తరలిరావాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చేపడుతున్న నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. ఆదివారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన సభా స్థలిని పరిశీలించారు. వారి వెంట ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, ప్రమోద్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, వీరేష్, లక్ష్మయ్య, జమ్మిలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్, చిత్రంలో ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

చౌటుప్పల్: గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను చౌటుప్పల్ బస్టాండ్‌లో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం చాప్రా జిల్లా బనియాపూర్ మండలం హర్పూర్‌కర్హా గ్రామానికి చెందిన సునీల్ రాయ్, బిట్టు కుమార్ టిప్పర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వారిద్దరు తమ ఊర్లో గంజాయిని చాక్లెట్ల రూపంలో మార్చుకొని మూడు రోజుల క్రితం రైలులో బయల్దేరి ఆదివారం హైదరాబాద్‌కు వచ్చారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో విజయవాడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారితో మరో వ్యక్తి రావాల్సి ఉన్నందున మార్గమధ్యలో ఆదివారం సాయంత్రం చౌటుప్పల్‌లో దిగారు. తమ వెంట తెచ్చుకున్న బ్యాగులతో బస్టాండ్‌లో తిరుగుతుండగా.. అదే సమయంలో పెట్రోలింగ్ పోలీసులు అటుగా వచ్చారు. పోలీసులను చూసి వారిద్దరు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీసులు వారి వద్దకు వెళ్లి బ్యాగులను తనిఖీ చేయగా.. దుస్తుల నడుమ దాచి ఉంచిన 8 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు, సెల్‌ఫోన్ లభించాయి. వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీసులు పట్టుకున్న నిందితులు వీరే..

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడులు

- కంపాసాగర్ కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్

త్రిపురారం: వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో బోర్లు, బావుల కింద నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే వరి నారు పెంపకం చేపట్టారు. కూలీలతో నాట్లు వేయించడానికి సిద్ధమవుతున్నారు. ప్రతి యేటా కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమయం, పెట్టుబడి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి తగ్గించుకోవడానికి డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలు నేరుగా విత్తుకుంటే సమయం ఆదా అవ్వడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచిస్తున్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలు విత్తుకునే పద్ధతిపై ఆయన సలహాలు, సూచనలు..

అనువైన నేలలు

సాధారణంగా వరి సాగు చేసుకునే అన్ని రకాల నేలల్లో డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరి విత్తనాలను విత్తి సాగు చేసుకోవచ్చు. ముంపునకు గురయ్యే భూములు, చౌడు, క్షారము, ఆమ్ల నేలలు అనుకూలం కాదు.

వరి విత్తన మోతాదు

వరి రకాన్ని బట్టి ఎకరానికి 10 నుంచి 15 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. వేరు వ్యవస్థ ధృడంగా ఉండి కాండం గట్టిగా ఏర్పడి అకాల వర్షాలు, ఈదురు గాలులకు పడిపోకుండా ఉండే అనువైన రకాలను శాస్త్రవేత్తల సూచనలతో ఎంచుకోవడం ఉత్తమమైన పద్ధతి. అవసరమైతే రైతులకు ఇష్టమైన ఏ వరి రకం విత్తనాలనైనా ఎంచుకోవచ్చు. ఈ పద్ధతిలో ఒక్క ఎకరం పొలం విత్తుకోవడానికి ఇద్దరు కూలీలు అవసరమవుతారు. డ్రమ్ సీడర్ లాగడానికి ఒక వ్యక్తి, గింజలు నింపడానికి ఒక వ్యక్తి అవసరమవుతారు. ట్రాక్టర్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేసిన డ్రమ్ సీడర్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు.



డ్రమ్ సీడర్ సహాయంతో వరి విత్తనాలు విత్తుకుంటున్న రైతులు

ప్రధాన పొలం తయారీ విధానం

సాధారణ పద్ధతిలో వరి నాటడానికి పొలాన్ని తయారు చేసుకున్నట్లుగానే డ్రమ్ సీడర్ పద్ధతికి కూడా పొలాన్ని తయారు చేసుకోవాలి. పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే బయటకు పోవడానికి వీలుగా ఏర్పాటు చేసుకోవాలి. వీలైనంత చదునుగా చేసుకుంటే ఉత్తమం. చిన్న మడులుగా ఉంటే నీరు పెట్టడానికి విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. విత్తే సమయానికి నీరు లేకుండా బురదగా ఉంటే చాలు. ఇసుక శాతం ఎక్కువగా ఉన్న నేలల్లో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి మండె కట్టి విత్తనాలను విత్తుకోవాలి.

విత్తుకునే పద్ధతి

లీటరు నీటికి గ్రాము చొప్పున కార్బండిజమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలు 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండె కట్టాలి. కొద్దిగా కొమ్ము మలిగిన గింజలను డ్రమ్ సీడర్ ద్వారా విత్తుకోవచ్చు. నారు మడిలో నీటి యాజమాన్యం ఏవిధంగా చేస్తామో వరి మొదటి దశలో అదేవిధమైన పద్ధతిని అవలంబించాలి. డ్రమ్ సీడర్ పరికరానికి అవసరాన్ని బట్టి ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి డ్రమ్ముకు 20 సె.మీ. దూరంలో రెండు చివర్ల వరకు రంధ్రాలు ఉంటాయి. ఈ డ్రమ్ముల్లో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. మొలకెత్తిన గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్ములో మూడో వంతు మాత్రమే గింజలు నింపాలి. గింజలను నింపిన డ్రమ్ములను లాగితే 8 వరుసలలో వరుసకు వరుసకు మధ్య దూరం 20సెం.మీ., వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5 నుంచి 8సెం.మీ. ఉంటుంది. ఒక్కో కుదురులో 5 నుంచి 6 గింజలు రాలడం జరుగుతుంది. సన్న గింజ రకం విత్తనాలకు రంధ్రం వదిలి మరో రంధ్రం మూయాలి. ప్రతి 15 వరుసలకు అడుగు వెడల్పు కాలిబాటలు ఉంచాలి. తాడు ఉపయోగించి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. కోనోవీడర్ తిప్పడానికి వీలుగా ఉంటుంది.

కలుపు నివారణ చర్యలు

విత్తిన మూడో రోజున పైరాజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా బెంథియోకార్బ్ 1.25 లీటర్లు లేదా బుటాక్లోర్ + సేఫెనర్ 1.25 ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి విత్తిన 8 నుంచి 10 రోజులలోపు పొలంలో పల్చని నీరు ఉంచి చల్లుకోవాలి. దమ్ము చేసిన పొలంలో మండె కట్టిన విత్తనాన్ని పొలమంత సమంగా నీటి పార నుంచి వెదజల్లాలి.

అధిక దిగుబడి

సాధారణ సాగు కన్నా డ్రమ్ సీడర్ పద్ధతిలో పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. సాళ్లలో కోనోవీడర్ ద్వారా కలుపు తీస్తే ఈ కలుపు మొక్కలు పంటకు పచ్చిరొట్ట ఎరువు అవుతుంది. పిలకలు, దుబ్బులు అధికంగా వస్తాయి. విత్తిన తర్వాత పంట కాలంలో రెండు నుంచి మూడుసార్లు కోనోవీడర్ తిప్పితే అధికంగా పంట దిగుబడి వస్తుంది.